ధాన్యం డబ్బుల దుర్వినియోగంపై విచారణ

మర్రిముచ్చాలలో విచారణ చేస్తున్న ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, మే 28: 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో బుధవారం 'బాధితులకు న్యాయం చేయాలి' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి ఐకేపీ అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం మండలంలోని మర్రిముచ్చాలలో విచారణ చేపట్టారు. కొమురవెల్లి ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందితో రైతుల సమక్షంలో విచారణ జరిపారు. ఏప్రిల్ 20 నుంచి ఈనెల 24వరకు రైతుల నుంచి 8,742 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని, ఇందులో రైతులకు చెందిన 283 బస్తాలు ధాన్యం ఎలక్ట్రానిక్ తూకం మిషన్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు వందన దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలింది. దీంతో రైతుల డబ్బులను రైతులకు చెల్లిస్తానని వందన ఒప్పుకున్నారు. కాగా, వందనను విధుల నుంచి తొలిగిస్తున్నట్లు ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి విలేకరులకు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, గ్రామస్తులు

అక్కన్నపేట, మే 28: మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో చేపట్టనున్న హనుమాన్, గణపతి నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సాంబరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఆవిష్కరించారు. సాంబరాజు మాట్లాడుతూ వచ్చేనెల 7న నిర్వహించే ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దాతల సహకారంతో ఆలయ ఆవరణలో వివిధ దేవతమూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూజరి నాగిళ్ల లక్ష్మణామూర్తి, గ్రామస్తులు సదయ్య, మల్లేశం, బాలయ్య, సాయిలు, సారయ్య, వల్లపు రాజు, సత్యనారాయణ, రాజు, సదయ్య, కనకయ్య, బాల మల్లు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకాన్ని అంతమొందించాలి

మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

అక్కన్నపేట, మే 28: నేటి సమాజంలో మహమ్మారిగా మారిన డ్రగ్స్ వాడకాన్ని అందరూ కలిసికట్టుగా అంతమొందించాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. జేఏసీ, మహిళ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర మండలంలో బుధవారంతో ముగిసింది. మహిళా సంఘాలు, జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు మండల కేంద్రమైన అక్కన్నపేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో జరిగిన ముగింపు సమావేశం నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు ఋతుప్రేమపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి, హుస్నాబాద్ జేఏసీ కోఆర్డినేటర్లు మేకల వీరన్నయాదవ్, డ్యాగల సారయ్య, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, కుమారస్వామి, పద్మ, జగన్, ప్రభాకర్, డీఎల్‌పీ, ఎంపీడీవో, ఎంపీవో, సీడీపీవో, ఏపీఎం, మహిళా సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా రేషన్ కార్డుల ప్రక్రియ

- జగిత్యాల జిల్లాకు బదిలీ అయిన నంగునూరు కార్డులు
- అయోమయానికి గురవుతున్న లబ్ధిదారులు

నంగునూరు, మే 28: కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్నవారి పేర్లు ఇష్టారీతిలో ప్రచురించబడ్డాయి. మండల పరిధిలోని కొండంరాజ్‌పల్లికి చెందిన కొంతమంది లబ్ధిదారుల పేర్లు జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని ఓ గ్రామానికి జారీ అయినట్టుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు వెళ్లి మీ సేవలో తనిఖీ చేయగా.. కొండంరాజ్‌పల్లికి చెందిన 8 కుటుంబాల పేర్లు జగిత్యాల జిల్లాలోని ఒకే రేషన్ షాప్‌లో వచ్చినట్టుగా చూపించడంతో లబ్ధిదారులు ఖంగుతిన్నారు. ఇప్పటి వరకు పది కుటుంబాలను జగిత్యాల జిల్లాకు బదిలీ అయినట్టుగా గుర్తించారు. ఇంకా ఎంత మందివి ఇలా జరిగాయో తెలియని పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. స్థానిక తహశీల్దార్ సరిత చొరవ తీసుకొని జగిత్యాల జిల్లా అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. సమస్య పరిష్కరించాలని జగిత్యాల జిల్లా మల్లాపూర్ తహసీల్దార్‌ను కోరారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మర్కుక్, మే 28: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్‌లోని రైతువేదికలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గిస్తూ, రసాయనాలను అవసరం మేరకు వినియోగించి భూసారాన్ని కాపాడాలన్నారు. మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు వసంతరావు, హార్టికల్చర్ ఆఫీసర్ రమేశ్, విష్ణు, రైతులు పాల్గొన్నారు. అంతకు ముందు పంటల సాగుపై ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు.

బ్రిడ్జిపై గుంతలు.. అధికారుల కండ్లకు గంతలు

జగదేవ్‌పూర్-అలిరాజ్‌పేట గ్రామాల మధ్యన గల బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు

గజ్వేల్, మే 28: జగదేవ్‌పూర్-అలిరాజ్‌పేట గ్రామాల మధ్య బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిస్తే గుంతల్లో నీళ్లు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది భారీ కంటైనర్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనదారులు తమ గమ్యస్థానాలకు రాకపోకలు సాగిస్తుంటారు. జగదేవ్‌పూర్-అలిరాజ్‌పేటల మధ్యన గతంలో బ్రిడ్జి ఒకే వరుసలో ఉండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు వరుసలుగా కొత్త బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి ప్రమాదకరంగా మారగా, సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అంటూ వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజు భారీ కంటైనర్లు మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, చిట్యాల, భువనగిరి, గజ్వేల్, తూప్రాన్ జాతీయ రహదారి మీదుగా నాందేడ్, నాగపూర్ వంటి ప్రాంతాలకు వెళ్తుండగా గుంతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కేసుల పరిశోధన పారదర్శకంగా చేయాలి

- గంజాయి, డ్రగ్స్ రవాణాపై మరింత నిఘా పెంచాలి
- పెండింగ్ కేసుల సమీక్షా సమావేశంలో సీపీ అనురాధ

మాట్లాడుతున్న సీపీ

సమీక్షా సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

సిద్దిపేట, మే 28: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై మరింత నిఘా పెంచి గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి పోలీసులు కృషి చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశించారు. బుధవారం స్థానిక కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024, 2025 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి ఏసీపీలను, సీఐలను, ఎస్ఐలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ ప్రో యాక్టివ్ పోలీసింగ్‌పై దృష్టి సారించి నేరాలను తగ్గించాలని, కేసుల పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని, పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు. దొంగతనాలపై పాత నేరస్తులపై నిఘా ఉంచి కేసులను ఛేదించాలన్నారు. క్రైమ్ ప్రో ఏరియాపై నిఘా మరింత పెంచాలని, ఆత్మహత్య కేసులలో మరణానికి గల కారణాల గురించి అన్ని కోణాల్లో పరిశోధన చేసి కేసులు పరిష్కరించాలని సూచించారు. మొబైల్ ఫింగర్ ప్రింట్ డ్రైవ్ రాత్రి సమయాలలో ఉపయోగించాలని, సీసీటీఎంఎస్ డాటాను వారానికి ఒకసారి ఏసీపీలు పర్యవేక్షించాలని సూచించారు. జూన్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున గుర్తించిన కేసులు పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో 60రోజులలో విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రవీందర్ రెడ్డి, నర్సయ్య, సదానందం, సుమన్ కుమార్, రవీందర్, శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఇన్స్పెక్టర్లు, సీఐలు, ఎస్ఐలు, ప్రొబిషనరీ ఎస్ఐలు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, మే 28: పచ్చని ప్రకృతిని భవిష్యత్ తరాలకు అందించే దిశగా జిల్లాలో పండుగ వాతావరణంలో మొదల్ ప్లానిటేషన్ కొరకు అధికారులు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో మొక్కలు నాటే కార్యక్రమంపై ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పొతారెడ్డిపేట నుండి హుస్నాబాద్ వరకు, దుద్దెడ ఎక్స్‌రోడ్డు నుండి వీరన్నపేట వరకు గల జాతీయ రహదారిని ఆనుకొని రోడ్డుకు ఇరువైపుల రెండు వరుసలలో మొక్కలు నాటడానికి పనులు ప్రారంభించాలన్నారు. అన్ని గ్రామాలలో ప్రతిరోజు గుంతలు తీసే పనులు జూన్ 5 లోగా పూర్తిచేసి, జూన్ 5న వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నందున అధికారులు పనులు వెంటనే ప్రారంభించి ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. పెద్దగా పెరిగే మర్రి, రావి, చింత, వేప, గుల్మార్ లాంటి మొక్కలు మొదటి వరుసలో, చిన్నగా పెరిగే మొక్కలు రెండవ వరుసలో నాటేలా చూసుకోవాలన్నారు. రోడ్డు మార్గంలో రకరకాల మొక్కలు కాకుండా ఒకే విధమైన మొక్కలు నాటేలా చూడాలన్నారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట, మే 28: జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది తమ శాలరీ అకౌంట్‌ను పోలీస్ శాలరీ ప్యాకేజీలోకి మార్చుకోవాలని సీపీ అనురాధ సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ వెంకటేశ్ మరణించగా, అతని కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజ్ స్కీం ప్యాకేజీ కింద కోటి రూపాయల ఇన్సురెన్స్ చెక్కును ఆ బ్యాంకు ఆర్ఎం మారుతితో కలిసి వెంకటేశ్ కుటుంబీకులకు బుధవారం అందజేశారు. సీపీ అనురాధ మాట్లాడుతూ ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీ తీసుకుంటే ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కొంత తోడ్పాటు నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, బ్యాంకు రీజనల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



హంగర్ ఫ్రీ వరల్డ్ పథకాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, మే 28: సామాజిక సేవకు మలబార్ గోల్డ్ వార్షిక బడ్జెట్‌లో 60 శాతం నిధులను కేటాయించడం అభినందనీయమని సిటిజన్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకొని హంగర్ ఫ్రీ వరల్డ్ పథకాన్ని బుధవారం సిద్దిపేట మలబార్ గోల్డ్ షోరూంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చడానికి, పేదరిక నిర్మూలనకు, మహిళ సాధికారత, పర్యావరణ పరిరక్షణ, పేదలకు గృహనిర్మాణ, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక అంశాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగించడం సంతోషకరమన్నారు. మలబార్ గోల్డ్ స్టోర్ డైరెక్టర్ శారీక్ షరాఫ్ మాట్లాడుతూ సామాజిక సేవ కోసం 2025-26 సంవత్సరానికి రూ. 150 కోట్లు కేటాయించామని, ఇందులో భాగంగా నిరుపేదల ఆకలి తీర్చడానికి ప్రతిరోజు దేశ వ్యాప్తంగా 70వేల మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. పథకం ప్రారంభమైన మూడేళ్లలో 2.5 కోట్ల మందికి అన్నదానం చేశామనారు. సిద్దిపేట జిల్లాలో ఈ పథకం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు శివ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కొమురవెల్లి: మాట్లాడుతున్న కరుణాకర్

మద్దూరు: మాట్లాడుతున్న ఏఎన్ఎం జ్యోతి

కొమురవెల్లి, మే 28: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని గురువన్నపేట పంచాయతీ కార్యదర్శి చిలుక కరుణాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గురువన్నపేటలో అంతర్జాతీయ రుతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రుతు శుభ్రత (నెలసరి)పై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుటుందని తెలిపారు. మహిళలకు రుతుక్రమంపై అవగాహన ఉండాలని సూచించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మద్దూరులో...

మద్దూరు(ధూళిమిట్ట), మే 28: మద్దూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ రుతు శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రుతుప్రేమ గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుతుప్రేమ కార్యక్రమం గురించి ఏఎన్ఎం జ్యోతి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు యాకమ్మ, దుర్గలత, ఆశా కార్యకర్తలు, సీఏలు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలి



మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చేర్యాల, మే 28: పట్టణంలోని జాతీయ రహదారిని అనుకుని గుంటూరుపల్లి, అయ్యప్ప కాలనీ వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కోరుతూ గుంటూరుపల్లి అయ్యప్పకాలనీ వాసులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నుంచి గుంటూరుపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇదే మార్గంలో రెండు పాఠశాలలు, గుంటూరుపల్లి, అయ్యప్ప కాలనీలకు ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్డు ధ్వంసం కావడం, డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, అయ్యప్పకాలనీ అధ్యక్షుడు పరమేశ్వర్, కామేశ్వర్‌రెడ్డి, దశమంతారెడ్డి, రాజు, వెంకటస్వామి, చంద్రారెడ్డి, రవి,సత్యనారాయణ తదితరులున్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సిద్దిపేట, మే 28: టీబీరహిత జిల్లాగా మార్చేందుకు వైద్య సిబ్బందితో పాటు ప్రజలందరూ భాగ్యస్వామ్యం కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.పల్వన్ కుమార్ అన్నారు. బుధవారం నాసర్‌పుర అర్బన్ హెల్త్ సెంటర్ సిద్దిపేటలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రహిత జిల్లాగా మార్చడంలో వైద్యసిబ్బంది, ఐఎంఏ వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కృషి చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన వారిలో క్షయ వ్యాధి లక్షణాల కోసం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. టీబీ చికిత్స పొందినవారికి, చికిత్సను మధ్యలో ఆపినవారికి, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, పొగతాగే వారికి, ఆల్కహాల్ సేవించేవారికి, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, హెచ్ఐవీ, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారికి, తరచుగా అనారోగ్యం పాలవుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి వైద్యులు టీబీ పరీక్షలు చేయాలన్నారు. లక్షణాలు ఉన్నవారికి డాట్ పద్ధతి ద్వారా పూర్తిగా చికిత్స ఉచితంగా అందించాలన్నారు. వీరికి ప్రభుత్వం చికిత్స కాలంలో ఆరు నెలల వరకు నెలకు రూ.1000 డీబీటీ అకౌంట్ ద్వారా వారి బ్యాంక్ ఖాతాలో పోషకాహార నిమిత్తం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో టీబీ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ప్రత్యేకంగా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో తెమడ, ఎక్స్‌రే పరీక్షల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

సిద్దిపేట, మే 28: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డివైఎస్‌వో వెంకటనరసయ్య అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంలో జరిగిన అండర్-8, 10, 12 బాల బాలికల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన 17 మంది చిన్నారులను జూన్ 1న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి గౌడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ పీడీ ప్రభుకుమార్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్ రెడ్డి, శిక్షకులు ప్రభాకర్, నిశాంక్ గౌడ్, లక్ష్మణ్, వేణు, రాజు, రాహుల్, లీలానంద్, సంజీవ్, విజయ్, భరత్, ఉమేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కూలీలను ఇబ్బందులకు గురిచేయొద్దు

కూలీలతో మాట్లాడుతున్న వెంకట్‌మావో

చేర్యాల, మే 28: ఉపాధి హామీ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో ఆరోపించారు. బుధవారం నాడు యన మండలంలోని చుంచనకోటలో ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట్‌మావో మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలోని ఒక్కో అంశాన్ని తొలగిస్తూ నిధులను తగ్గించి కూలీలకు సకాలంలో పని చేసిన డబ్బులు ఇవ్వడం లేదన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, టెంటు సౌకర్యాలు కల్పించడం లేదని, అలాగే సమ్మర్ అలవెన్స్, పే స్లిప్పులు, గడ్డపార పదును పెట్టె చార్జీలు ఇవ్వడం లేదన్నారు. అలాగే కొత్తకార్డులకు మంగళం పాడారని ఆరోపించారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి కూలీలు తరలిరావాలని కోరారు. ఆయన వెంట నాయకుడు గొర్రె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చిన్న బ్రహ్మయ్య.. కేరాఫ్ బెస్ట్ ప్రాక్టీస్

చిన్న బ్రహ్మయ్య

మర్కుక్, మే 28: రాష్ట్ర విద్యుమా పరిశోధనా శిక్షణ మండలి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రాక్టీస్‌గా మర్కుక్ మండలం దామరకుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య ఎంపికైనట్లు ఎంఈవో వెంకట్‌రాములు బుధవారం తెలిపారు. వచ్చేనెలలో రాష్ట్ర స్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో జరిగే ప్రదర్శన ఈనెల 24న కలెక్టర్ సూచన మేరకు ఏర్పాటైన కమిటీ అధ్యక్షుడు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. బ్రహ్మయ్య చేస్తున్న వివిధ వినూత్న బోధనా ప్రక్రియలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మే 28: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరుకుతుందని అక్బర్‌పేట-భూంపల్లి ఎంఈవో అంజాగౌడ్ అన్నారు. బుధవారం వీరారెడ్డిపల్లిలో బడిబాట నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ బడుల్లో ఉన్నత విద్య అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, కవిత, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొమురవెల్లి, మే 28: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొమురవెల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలంలోని కడవేర్గుకు చెందిన కొయ్యడ వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి మూడేండ్ల క్రితం జీవోనోపాధి నిమిత్తం కొమురవెల్లికి వచ్చాడు. వెంకటేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసై మద్యం సేవించడానికి డబ్బులు కావాలని భార్య పద్మను వేధించేవాడు. మంగళవారం రాత్రి మద్యం తాగివచ్చిన వెంకటేశ్ భార్యతో గొడవపడి ఇంట్లోని గదిలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజు తెలిపారు.

పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ

పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న గజ్వేల్ ఎంఈవో కృష్ణ

గజ్వేల్, మే 28: మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు బుధవారం పాఠ్య పుస్తకాలను గజ్వేల్ ఎంఈవో కృష్ణ ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ముందుగానే రావడం జరిగిందన్నారు. పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో